ప్రజాశక్తి

శుక్రవారం 19 జనవరి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

విజయవాడ స్వరాజ్య మైదానంలో ఆవిష్కరణకు సిద్ధమైన అంబేద్కర్ భారీ విగ్రహం, స్మృతివనం

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

సిఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు

గంజాయి మొక్కలను పెరికేయాలి

'రా...కదలిరా..' సభలో వైసిపి నేతలనుద్దేశించి చంద్రబాబు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, గుడివాడ రూరల్ : ఎందరో మహానుభావులు పుట్టిన తులసివనం లాంటి కృష్ణాజిల్లాలో దోపిడీ, లూటీలకు పాల్పడుతూ వైసీపీ ప్రజాప్రతినిధులు గంజాయి మొక్కల్లా తయారయ్యారని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు విమర్శించారు. "టిడిపి రా..కదిలిరా' బహిరంగ సభను కృష్ణాజిల్లా గుడివాడ మల్లాయపాలెం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ జిల్లా ప్రజలు మేల్కొని ఈ గంజాయి మొక్కలను పీకి వేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలు ఇసుక, మట్టి, గ్రావెల్ లూటీ చేశారన్నారు. బూతులు (మిగతా 6లో)

గుడివాడలో తీవ్ర ఉద్రిక్తత

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వైసిపి, టిడిపి నేతలు చేపట్టిన పోటాపోటీ కార్యక్రమాలతో గురువారం గుడివాడలో ఉద్రిక్తత ఏర్పడింది. ఎన్టీఆర్ వర్ధంతి రోజున జరిగిన ఈ ఘటనలతో గుడివాడ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఒకపక్క స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని, మరోపక్క టిడిపి నేతలు...ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. దీనిలో (మిగతా 6లో)

గుడివాడలో టిడిపి, జనసేన - వైసిపి కార్యకర్తల బాహాబాహీ

వైసిపి తిరువూరు ఇన్చార్జిగా నల్లగట్ల స్వామిదాసు

ప్రజాశక్తి - తిరువూరు : వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జిగా నల్లగట్ల స్వామిదాసు నియమితుయ్యారు. గురువారం రాత్రి 10.30 గంటలకు బొత్స సత్యనారాయణ విడుదల చేసిన వైసిపి నాలుగో జాబితాలో స్వామిదాస్ పేరును ఖరారు చేశారు. టిడిపి రాష్ట్ర నాయకునిగా ఉన్న స్వామిదాస్ ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. 2014, 2019 ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా గెలుపొందిన రక్షణనిధిని మార్చుచేసి ఆయన స్థానంలో స్వామిదాసును నియమించారు. స్వామిదాసు 1994లో టిడిపి అభ్యర్థిగా తిరువూరు నియోజవర్గం నుండి వామపక్షాల మద్దతుతో పోటీ చేసి గెలు పొందారు. ఆ తర్వాత 1999 ఎన్నికల్లో కూడా మరోసారి ఎంఎల్‌ఎగా గెలిచి 2004 వరకు కొనసాగారు. అక్కడి నుండి వరుసగా 2004, 2009, 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆయన 2014లో ఓడిపోయినా టిడిపి అధికారంలోకి రావటంతో నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో ఆయనను చంద్రబాబు పక్కనపెట్టి అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి కొత్తపల్లి జవహర్‌ను టిడిపి అభ్యర్థిగా తిరువూరులో పోటీకి దింపారు. అయితే వైసిపి అభ్యర్థి రక్షణనిధి చేతిలో జవహర్ ఓడిపోయారు. దీంతో ఈసారి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా సేవల దేవదత్‌ను చంద్రబాబు నియమించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇటీవల విజయవాడ ఎంపి కేశినేని నాని వైసిపిలో చేరడంతో స్వామిదాసు కూడా వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా ఆయనను తిరువూరు ఇన్చార్జిగా వైసిపి నియమించింది.

నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ వరలక్ష్మి మృతి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మీ (58) గురువారం ఉదయం మృతిచెందారు. ఆమెకు భర్త మండవ పిచ్చయ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా వరలక్ష్మీ అనారోగ్యంతో బాధపడుతున్నారు. నందిగామ ఎంఎల్‌ఎ మ్నొండితోక జగన్ మోహన్‌రావు, ఎంఎల్‌సి ఎం.అరుణ్‌కుమార్, మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య, పలువురు వైసిపి, టిడిపి నాయకులు ఆమె భౌతికకయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మండవ వరలక్ష్మీ పలు అభివద్ధి పనులు చేశారు. నందిగామలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చారు. ప్రజలకు సక్రమంగా మంచినీరు అందించారు. ప్రతి నెలా ఒకటవ తేదీలోపు పించన్లు పంపిణీ చేశారు. నందిగామలో సిఎం రోడ్డుతోపాటు పలు రోడ్ల విస్తరణకు కృషి చేశారు. కరోనా సమయంలో సొంత నిధులతో మిషన్లు తీసుకువచ్చి ఫాగింగ్ చేయించారు. పారిశుధ్యం మెరుగుపర్చారు.

వరలక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ జగన్మోహనరావు; అంతర్‌చిత్రంలో వరలక్ష్మి పాతచిత్రం

ముగిసిన 'సంకల్ప' వారోత్సవాలు

ప్రజాశక్తి - మైలవరం

అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా స్థానిక అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సామాజిక సమత సంకల్ప వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వ్యాసరచన, డిబేట్, చిత్రలేఖనం, పాటలు, డాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి - నందిగామ

నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం నందిగామలో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాల పనులు పూర్తికావడంతో అధికారికంగా ప్రారంభోత్సవం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, సెక్రెటరీ పి.ప్రకాష్, సీనియర్ న్యాయవాదులు కొనకంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు

రాజీవ్‌నగర్‌లో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్ నగర్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాజీవ్ నగర్ ఆర్‌జిఎంసి హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాథోడ్, సమీర, పూర్ణిమ, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాస్టర్లకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి - నందిగామ

పాత బైపాస్ రోడ్ షాలేము ప్రార్థనా మందిరంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ మండల కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు హానోకు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొక్కా జార్జి ముల్లర్ మాట్లాడుతూ పాస్టర్లు గుర్తింపుకార్డులు కలిగి ఉండాలన్నారు. అనంతరం సభ్యులకు గుర్తింపు కార్డులు, నియామకపత్రాలను అందించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు జకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మధు బాబు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట

పట్టణంలోని ఆర్‌టిసి డిపో గ్రౌండ్‌లో పది రోజులుగా నిర్వహిస్తున్న నూకల రవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో ప్రథమ బహుమతి ఎస్‌జిఎస్ టీము, ద్వితీయ బహుమతి బాబు జెఎంసి, తృతీయ బహుమతి జెడ్‌సిసి జట్లు గెలుపొందాయి. వీరికి టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి శ్రీరామ్‌రాజగోపాల్, చౌడవరపు జగదీష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్ పోటీలను నియోజకవర్గస్థాయిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులకు బెదరం

38వ రోజు సమ్మెలో అంగన్వాడీలు

ఐసిడిఎస్ అధికారులకు వినతులు

పలుచోట్ల నిరసన ప్రదర్శనలు


మైలవరంలో..

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో అంగన్వాడీల సమ్మె గురువారానికి 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలుచోట్ల ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం అంగన్వాడీలకు జారీచేసిన షోకాజ్ నోటీసులకు సమాధానాలిస్తూ ఐసిడిఎస్ కార్యాలయాల్లో అధికారులకు వినతులను అందించారు.

జుజ్జూరు: మండలంలోని అంగన్వాడీలు 38వ రోజు జుజ్జూరులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగనన్నకు చెబుదాం సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ధర్నా చేపట్టారు. మండలంలో 22 గ్రామపంచాయతీల్లో సంతకాల సేకరణ చేపట్టారు. జుజ్జూరులో సిఐటియు మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్ మాట్లాడారు.

జగ్గయ్యపేట: మండలంలో అంగన్వాడీల సమ్మె 38వ రోజూ కొనసాగింది. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల, ఐద్వా నాయకులు ఎస్.నాగమణి, సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో మండలంలోని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారికి అంగన్వాడీలు నోటీసులకు సమాధానం లిఖితపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోగా వారు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా అంగన్వాడీలపై కక్ష సాధింపునకు పాల్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు టి మధుకుమారి, అంజమ్మ, విశాలాక్షి, సువర్చల, రత్నకుమారి, లక్ష్మీ, మేరి, లీల జానమ్మ, ఉమారాణి, ఖాజాబి, హసీనా పాల్గొన్నారు.

మైలవరం : స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన షోకాజ్ నోటీసులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం సిడిపిఒకు షోకాజ్ నోటీసులకు సమాధాన ప్రతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం, జి.కొండూరు, ఇబ్రహింపట్నం మండలాల సిఐటియు కార్యదర్శులు సిహెచ్.సుధాకర్, కె.బాలకృష్ణ, ఎం.మహేష్, అంగన్వాడీల యూనియన్ నాయకులు పుష్పకుమారి, మాణిక్యం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తిరువూరులో..

నందిగామ : మండలంలోని అంగన్వాడీలు నందిగామలో ర్యాలీగా ఐసిడిఎస్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అధికారులకు షోకాజ్ నోటీసులకు సమాధానాలు రాస్తూ అధికారులకు వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకట్రావమ్మ, మహాలక్ష్మి, వేణు, లక్ష్మీ, పిచ్చిమ్మ, సుజాత, వాసవి పాల్గొన్నారు.

తిరువూరు : షోకాజ్ నోటీసులకు బెదిరేదిలేదని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని మండలంలోని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా షోకాజ్ నోటీసులకు సమాధాన నోటీసులను గురువారం అందజేశారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, నిర్మల, కస్తూరి, నాగమణి, శ్రీలక్ష్మి, ఉషారాణి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

రెండో రోజుకు నిరవధిక దీక్ష

విజయవాడ : వేతనాలు పెంచి అంగన్వాడీల నిరవధిక సమ్మెను విరమింప చేయాలని పలు సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల కనీస డిమాండ్లను పరిష్కరించడం వల్ల అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం అవుతుందని తెలిపారు. గురువారానికి అంగన్వాడీ రాష్ట్ర నాయకుల నిరవధిక నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ దీక్షలకు పలు కార్మిక, ప్రజాసంఘాలు తమ సంఘీభావాన్ని తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు అంగన్వాడీలు తమ సమాధానమిచ్చారు. ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ విగ్రహాల ఆవిష్కరణతో మహనీయుల ఆశయాలు నెరవేరవని, వాటికి తగిన చర్యలు చేపట్టినప్పుడే వారి ఆశయాలు ముందుకు తీసుకెళ్లినట్లు అవుతుందని చెప్పారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా అయినా అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నేతలను పరామర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేతలు వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, రాణి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీదేవి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రజా సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం ప్రసంగించారు. కళాకారులు, కవులు, శ్రామిక కవనాన్ని నిర్వహించి సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారులు జగన్, అనిల్, హనీఫ్ తమ పాటలతో సంఘీభావం తెలిపారు. సాహితీ స్రవంతి నాయకులు వొర ప్రసాద్, శాంతిశ్రీ, అరసం నాయకులు కొండపల్లి మాధవరావు, జనసాహితి నాయకులు దివి కుమార్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ నాయకులు గోళ్ల నారాయణరావు తమ రచనలతో అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. నగరంలోని ముఠా, ఆటో కార్మికులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. ఆన్‌లైన్ పిటిషన్స్ కూడా ప్రభుత్వానికి పంపుతున్నారు. సమ్మె 38వ రోజు కూడా విజయవంతంగా జరిగింది. ప్రభుత్వం వేతనాలు పెంచేవరకూ ఆందోళన నుండి వెనక్కి వెళ్ళేది లేదని అంగన్వాడీలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

తాగునీటి ట్యాంకర్లు అందజేత

ప్రజాశక్తి - మైలవరం

నియోజకవర్గంలోని 17 గ్రామాలకు రూ.42.50 లక్షల ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన తాటునీటి ట్రాక్టర్లను గురువారం స్థానిక ఎఎంసిలో ఎంపీ కేసినేని నాని, స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ ఆయా పంచాయతీల కార్యదర్శులకు, సర్పంచులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ నిధుల నుండి తాను కోరినట్లుగా రూ.1.80 కోట్లు మంజూరుకు నాని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, ఎంపిపి లక్ష్మీ ప్రసన్నరాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అందించిన ట్యాంకర్

శిక్షణా తరగతులకు హాజరైన ప్రజాప్రతినిధులు

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-వత్సవాయి

గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు మరింత కృషి చేయాలని ఎంపిడిఒ రమేష్ బాబు కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులకు, ఎంపిటిసిలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

గోశాలకు విరాళం

ప్రజాశక్తి- నందిగామ: ఎన్ఎస్ఆర్ ఛారిటబుల్ సొసైటీ మార్గదర్శకులు, కీర్తిశేషులు నందిరాజు శ్రీహరిరావు 78వ జయంతి పురస్కరించుకొని కుమారులు, కుమార్తె నందిరాజు ప్రకాష్, రాజా హనుమంతరావు, జ్యోత్స్న పల్లగిరి కొండపై గోశాలలో ఒకరోజు పోషణ నిమిత్తం రూ.3116 విరాళం గోశాల నిర్వాహకులు వందేమాతరం అశోక్‌కు అందజే శారు.

ఎసిబి అధికారుల విచారణ

వత్సవాయి: తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఈనెల 12న ఆలూరుపాడులో ఈనాం భూములకు పట్టాలిప్పించేందుకు రూ.50,400 లంచం తీసుకున్న ఘటనలో తహశీల్దార్‌ను, సర్పంచిని కూడా అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎసిబి అధికారులు ఆలూరుపాడుకు భూముల పట్టాలు ఎంతమందికి ఇచ్చారో వారిని తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించి ఎసిబి సిఐ నాగరాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

గుడివాడలో...

అవనిగడ్డలో...

గుడ్లవల్లేరులో...



గన్నవరంలో...



బందరులో...

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి కార్యక్రమాలు గురువారం కృష్ణాజిల్లా వ్యాప్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు టిడిపి నాయకులు పూలమాలల వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-గుడివాడ: టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 28వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. నాగవరప్పాడు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం గుడివాడ పట్టణ పురవీధుల్లో వందలాది మంది టిడిపి నాయకులతో అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఉన్న నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు. అనంతరం పురపాల సంఘ కార్యాలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందివాడ ఎంపిపి పెయ్యాల ఆదాం, పాలేటి చంటి, వెంపటి సైమాన్, పర్వతనేని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ జెడ్పిటిసి జంగం మోహనరావు, పొట్లూరి రవి, పోలవరం వెంకట్రావు, పళ్లెం నరసింహారావు వల్లభనేని రంగబాబు, సాయి నివాళు లర్పించారు. ఉలవపూడి గ్రామంలో గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కర్‌రావు, శేరీదగ్గుమిల్లి గ్రామంలో సర్పంచ్ జన్ను లక్ష్మి రాణి శివ కుమార్ పాల్గొన్నారు. **పెదపారుపూడి:** మండలంలోని యలమర్రు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరపనేని వెంకట సత్యనారాయణ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చలసాని రమేష్‌చౌదరి, కార్యదర్శి మసిముక్కు రాంబాబు, దానబోయిన వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం:** గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం గన్నవరంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఆగిరిపల్లి రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి యార్లగడ్డ వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, జాస్తి శ్రీధర్, జాస్తి ఫణి కుమార్, కాసరనేని రంగబాబు, మండవ లక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం రూరల్:** జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ బస్టాండ్ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, సర్పంచ్ తిమోతి, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, జిల్లా ఉపాధ్యక్షులు వంపుగడవల చౌదరి, మోకా రవి పాల్గొన్నారు. **చల్లపల్లి:** చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో నాయకులు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పైడిపాముల స్వప్న, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకట్రాం ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు పాల్గొన్నారు. నాగాయలంక పంచాయతీ కార్యాలయం తూర్పు బజారు రామాలయం సెంటర్లో జరిగిన కార్యక్రమంలో నిండు లక్ష్మణరావు, ముప్పాల ప్రసాద్, మండవ బాలవర్ధనరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి శిక్షణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గ్రామాభివద్ధి పథంలో నడవడానికి జి.పి.డి.పి. శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపీడీవో దారపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశంలో గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకొని తద్వారా గ్రామ పాలన చేసినట్లయితే ప్రతి గ్రామం అభివద్ధి పథం లో నడుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, ఇఓపిఆర్డి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** ప్రణాళికతో గ్రామ పంచాయతీల అభివద్ధికి బాటలు వేయాలని ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు కోరారు. చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివద్ధి కార్యక్రమంపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ చినరాట్నాలు మాట్లాడుతూ జీపీడీపీ కార్యక్రమం ప్రాధాన్యత అంశాలు వివరించారు.

వేదాంతానికి డాక్టరేట్

ప్రజాశక్తి-బంటుమిల్లి: మండలంలోని చిన్నతుమ్మడి గ్రామానికి చెందిన బట్టు వేదాంతానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ రేటును ప్రధానం చేసింది ఆయన సమర్పించిన ఎకనామిక్ ఎనాలసిస్ ఆఫ్ బ్యాకిస్ వాటర్ షింపు కల్టివేషన్ షింపు కల్టివేషన్ ఇన్ కష్ణా డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే పరిశోధనకు ఈ అవార్డును బహుకరించడం జరిగింది ఈ పరిశోధన ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ మరియు డీన్ గారైన ప్రొఫెసర్ ఎం మధు పర్యవేక్షణలో జరిగింది ఈయన వైఎస్ఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్ గా పనిచేస్తున్నారు స్కూల్ అసిస్టెంట్ గా ఉద్యోగం సంపాదించి అంతటితో ఆగకుండా పట్టుదలతో డిగ్రీ కళాశాలలో ఉద్యోగం సంపాదించారు అంతేకాకుండా ఎకనామిక్స్ లో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

శాంసంగ్ ప్రీ బుకింగ్స్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్ బ్రాండ్ శాంసంగ్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ల కోసం ముందస్తు ప్రీ బుకింగ్‌లను ప్రారంభించినట్లు శాంసంగ్‌షోరూమ్ ప్రతినిధి ఎస్. రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఎస్24 ప్లస్, గెలాక్సీ ఎస్24 స్మార్ట్‌ఫోన్‌ల కోసం ఈప్రీ బుకింగ్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. గెలాక్సీ ఎస్24 సిరీస్ సౌకర్యవంతమైన కమ్యూనికేషన్‌ను సాధ్యం చేస్తుందని పేర్కొన్నారు. గెలాక్సీ ప్రొవిజువల్ ఇంజన్‌తో సృజనాత్మకతతో కూడిన విధంగా ఉంటుందన్నారు. యువత కోసం ఎప్పటికపుడు నూతన ఆవిష్కరణలను శాంసంగ్ అందిస్తుందని తెలిపారు. వివరాలకు శాంసంగ్ స్టోర్లలోగాని లేదా అన్ని ఎలక్ట్రానిక్ షోరూమ్‌లలోనూ తెలుసుకోవచ్చని తెలిపారు.

దుర్గమ్మకు వెండి బిందె విరాళం

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానానికి గుంటూరుకు చెందిన జి.నారాయణ తీర్ధ సుమారు 585 గ్రాముల బరువు గల వెండి బిందెను గురువారం ఆలయ అధికారులను కలిసి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ సహాయ కమిషనర్ శాంతి పాల్గొన్నారు. ఆలయ అధికారులు దాత కుటుంబానికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

హుండీల ఆదాయం రూ.2.70 కోట్లు

దుర్గగుడి మహామండపం ఏడవ అంతస్తులో హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. భవానీ దీక్షల అనంతరం హుండీ లెక్కింపును దేవస్థానం అధికారులు నిర్వహించారు. అందులో భాగంగా నగదు రూ.2,70,48,680, బంగారం 280 గ్రాములు, వెండి 18 కేజీలు యాత్రికులు సమర్పించుకున్నారు. హుండీ లెక్కింపును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇఒ కె.ఎస్ రామరావు, పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణ, దేవాదాయ శాఖ ఏసీ శాంతి పర్యవేక్షించారు.

కెబిఎన్ విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి-వన్‌టౌన్: వన్‌టౌన్ కొత్తపేటలో గల కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి బాక్సింగ్ పోటీల్లో జాతీయ స్థాయి బహుమతిని సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు తెలిపారు. ఇటీవల చండీఘర్‌లో జరిగిన ఆల్ ఇండియా సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలలో తమ కళాశాల విద్యార్థి సోను భార్గవ్ కృష్ణా విశ్వవిద్యాలయం తరుపున పాల్గొని కాంస్య పతకం సాధించడం పట్ల గురువారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ సోను భార్గవ్ కష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించి ఆల్ ఇండియా సౌత్ వెస్ట్ బాక్సింగ్ పోటీలలో పాల్గొని ద్వితీయ స్థానాన్ని సాధించారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన సోను భార్గవ్, వ్యాయామ విభాగాధిపతి హేమచంద్రరావులకు కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, ఇంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ భాగ్యకుమార్ అభినందనలు తెలిపారు.

20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ-2024 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 20వ తేదీ ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారిణి తహేరా సుల్తానా తెలిపారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నగరంలోని జెడ్‌పి పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా 22 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరగుతోందని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన సిబ్బందికి ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణా ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలకు ఎటువంటి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, పరీక్ష కేంద్రం లోనికి ఇతరులు ఎవ్వరిని అనుమతించకూడదని, పరీక్ష హాలులో మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని, పరీక్ష నిర్వహణ విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని అన్నారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అడ్మిట్ కార్డు డౌన్ లోడ్ చేసుకోలేని అభ్యర్థులు nvs.nic.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని జవహర్ నవోదయ విద్యాలయ వేలేరు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు.

మాట్లాడుతున్న తహెరా సుల్తానా

26న సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఈ నెల 20 నుండి 26వ తేదీ వరకు మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో డాక్టర్ పోలాప్రగడ శ్రీనివాస్ స్వామిచే సుందరకాండ సప్తాహ పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిద్ధార్థ కళాపీఠం గౌరవాధ్యక్షులు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. మొగల్‌రాజపురంలోని పిబి సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలోని సిద్ధార్థ అకాడమి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నైతిక విలువలు, సామాజిక సేవ అలవరచాలనే ఉద్దేశంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం నుండి శుక్రవారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాలు జరుగతాయని తెలిపారు. చివరి రోజైన 26వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ సీతారామ కళ్యాణం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిద్ధార్థ కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎన్.లలిత్ ప్రసాద్, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, జగదీష్, కృష్ణ ప్రసన్న వైట్ల తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఎన్‌టిఆర్ ఆశయాలు ఆదర్శం

జిల్లావ్యాప్తంగా వర్ధంతి సభలు

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు ఆశయాలు ఆదర్శమని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. గురువారం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - నందిగామ

మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా నందిగామలో బళ్లారి రాఘవ కళాసమితి కార్యాలయం వద్ద బుధవారం రాత్రి సత్య హరిశ్చంద్ర, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పున్నవల్లె సీతారామాంజనేయస్వామి నాట్యమండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన చేశారు. బళ్లారి రాఘవ కళాసమితి అధ్యక్షులు బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి, ముక్కపాటి హనుమంతరావు, చిమటాబాపిరాజు, నాగరాజు, దుర్గారావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నందిగామ పట్టణ రైతుపేట టిడిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నందిగామ పట్టణ రైతు పేట పార్టీ కార్యాలయంలో, పాత బైపాస్, అనాసాగరం, కృష్ణుడి బొమ్మ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నందిగామ ప్రభుత్వ డివిఆర్ ఏరియా ఆసుపత్రి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

కంచికచర్ల : మండలంలో ఎన్‌టిఆర్ వర్ధంతి సభలను టిడిపి నాయకులు నిర్వహించారు. స్థానిక చెవిటికల్లు రోడ్డు సమీపంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు కోగంటి బాబు, ఎంపిపి మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో అన్నదానం చేశారు. పరిటాలలో అన్నదానం చేశారు. చెవిటికల్లు, గని ఆత్కూరు, గొట్టుముక్కల, మోగులూరు, మున్నలూరు తదితర గ్రామాల్లో వర్ధంతి సభలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి అల్లాడి కోటేశ్వరరావు, నాయకులు తాడపనేని లక్ష్మణరావు, గుత్తా రత్నం, రొంపిచర్ల శ్యాం, శంకర్ పాల్గొన్నారు.

విస్సన్నపేట: మండల కేంద్రమైన విస్సన్నపేటలో ఎన్‌టిఆర్ వర్ధంతి సభను టిడిపి, జనసేన నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాకా శ్రీనివాసరావు, రాయల సుబ్బారావు, డి.సత్యనారాయణ, వార్డు సభ్యులు వెంకట్రావు, మురుగుల ప్రసాద్, జనసేన నాయకులు షేక్ యాసీన్, అడపా శ్రీనివాసరావు, తోట కిషోర్ పాల్గొన్నారు.

వత్సవాయి : ఎన్‌టిఆర్ వర్ధంతిని వత్సవాయి, లింగాల, మక్కపేట, భీమవరం, పోలంపల్లి, మంగళ్లు తదితర గ్రామాల్లో నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, పెద్ది రామారావు, చెన్నె బాలకృష్ణ విజయవాడ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు ఆదిమళ్ల రమేష్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

రెడ్డిగూడెం : మండలంలో టిడిపి నాయకులు ఎన్‌టిఆర్ వర్ధంతి సభలు నిర్వహించారు. రెడ్డిగూడెంలో టిడిపి యువ నాయకుడు బొమ్మిన కోటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరువూరులో..

మైలవరం : మండల కేంద్రమైన మైలవరంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో లంక లితీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీమంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని విజయవాడ పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీరఘురాం, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. బుధవారం రాత్రి బూదవాడలోని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు కట్టా వెంకటనరసింహారావు, జిల్లా తెలుగు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గద్దం హుస్సేన్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని కాకాని నగర్, తొర్రగుంటపాలెంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు.

కంచికచర్లలో..

తిరువూరు : మండలంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని టిడిపి నాయకులు వర్ధంతి సభలు నిర్వహించారు. తిరువూరు, వావిలాల, రాజుగూడెం, ముష్టికుంట్ల తదితర గ్రామాల్లోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి శవాల దేవదత్తు, నాయకులు బొమ్మసాని ఉమామహేష్, సంకురాత్రి జనార్ధనరావు పాల్గొన్నారు.

గంపలగూడెం : మండలంలోని తోటమూల, ఊటుకూరు, పెనుగొలను, నెమలి, గంపలగూడెం తదితర ఎన్‌టిఆర్ వర్ధంతి సభలు నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు రేగళ్ల వీరారెడ్డి పలుచోట్ల ఎన్‌టిఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఎన్‌టిఆర్ వర్ధంతి నిర్వహించారు. వన్‌టౌన్‌లోని మాజీ ఎంఎల్‌సి బుద్దా వెంకన్న కార్యాలయంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని), బుద్దా వెంకన్న, నాగుల్ మీరా పాల్గొన్నారు. చిట్టినగర్‌లో పేద మహిళలకు చీరలు, పురుషులకు తువాళ్ళు పంపిణీ చేశారు. సితార సెంటర్‌లో, 44వ డివిజన్‌లో అన్నదానం నిర్వహించారు. 42వ డివిజన్‌లో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పాలఫ్యాక్టరీ ఆవరణలోని ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, సమితిబోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజయవాడ వన్‌టౌన్ పరిధిలో..



జగ్గయ్యపేటలో..



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా సురేష్‌బాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - కంచికచర్ల

కంచికచర్ల ఉప సర్పంచి, వైసిపి పట్టణ అధ్యక్షులు వేమా సురేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు వివిఎస్‌బి యూత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గొట్టుముక్కల రోడ్డులోని వేమా సురేష్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నందిగామ ఎంఎల్ఎ డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బంది, వివిఎస్‌బి యూత్ సభ్యులు సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వేమా రోజా రమణి, నాయకులు షేక్ రహీమ్, అనుమోలు వాసు పాల్గొన్నారు. ఎంఎల్‌సి డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, వేమా సురేష్‌బాబుకు ఫోన్‌లో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

హనుమంతరావును పరామర్శిస్తున్న నాయకులు

హనుమంతరావుకు తులసీరావు పరామర్శ

ప్రజాశక్తి - విస్సన్నపేట

తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు నేతలకు అండగా నిలిచిన రావి హనుమంతరావును వేమిరెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో సిపిఎం రాష్ట్ర నాయకులు బిఆర్.తులసీరావు గురువారం పరామర్శించారు. హనుమంతరావు(88) ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఇటీవల ఆయన సతీమణి మృతిచెందారు. హనుమంతరావు కుమారుడు రావి నరసింహారావు యుటిఎఫ్ ద్వారా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గొల్లపల్లి వెంకటరత్నం, చిన్నబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, మండల కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, సిపిఎం సానుభూతిపరులు పోటు రాంబాబు సిపిఎం వేమిరెడ్డిపల్లి శాఖ కార్యదర్శి మోరంపూడి రామారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నందిగామ

ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నందిగామ కమిటీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ జయరామ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ప్రకారం వేతనాలివ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు కండెల శ్రీను, దాసు, బాలు, ప్రభుదాసు, రమేష్, బ్రహ్మం పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - వత్సవాయి

మండలంలోని గట్టు భీమవరం పరిధిలోని జిఎంఆర్ టోల్ ప్లాజా వద్ద గురువారం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు బారులు తీరాయి. సంక్రాంతి పండగ ముగియడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చినవారు తిరుగుపయనమయ్యారు. వారి వాహనాలతో రహదారిపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్ఐ అభిమన్య తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీరాయితీ పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ

పేదల సొంతింటికలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గృహాలను మంజూరు చేయడంతో పాటు ఆర్థిక చేయుతను ఇచ్చేందుకు బ్యాంకుల నుండి రుణ సహాయాన్ని అందిస్తుందని కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. జగనన్న కాలనీలలో గృహనిర్మాణాలకు బ్యాంకుల నుండి రుణాలు పొందిన మహిళలకు వడ్డీ రాయితీ ఆర్థిక సహాయాన్ని గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వర్చువల్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నగరంలోని కలెక్టరేట్‌లోని ఎవిఎస్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం జిల్లాకు చెందిన లబ్ధిదారులకు వడ్డీ రాయితీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా నిర్మాణాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతోపాటు స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ఇంటి నిర్మాణం కోసం ముందస్తు పెట్టుబడి సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందచేస్తున్న ఆర్థిక చేయూతకు అదనంగా ఆయా ఇంటి నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేసిన వెంటనే తదుపరి దశ నిర్మాణం కోసం ముందస్తు ఆర్థిక సహాయం అందచేస్తున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సంకల్పంతో పెట్టుబడి మొత్తాన్ని దశల వారీగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 55,942 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున రూ.197.08 కోట్ల మేర అదనపు రుణ సదుపాయం అందించామన్నారు. ఆ రుణాలు తీసుకున్న లబ్ధిదారులు తదుపరి దశకు చెందిన ఇళ్ల నిర్మాణ పురోగతి సాధించిన వారిలో ఇప్పటి వరకు 17,861 మందికి రు.2.063 కోట్ల మేర తొలి విడత వడ్డీ రాయితీ సొమ్ము ఆయా లబ్ధిదారుల ఖాతాకు జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



రాయితీ డెమో చెక్కును అందిస్తున్న కలెక్టర్

ప్రతిఒక్క లబ్ధిదారులు సొంతింటి నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహం ద్వారా ప్రయోజనం పొందొచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి పావలా వడ్డీకే రూ.35వేలు చొప్పున బ్యాంకు రుణం కూడా అందిస్తున్నామని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీ శైలజారెడ్డి, బెల్లందుర్గ, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి శివశక్తిపుణ్యశీల, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, లీడ్‌క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ రూప్సీరాణి, హౌసింగ్ పీడీ రజినికుమారి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులకు అంగన్వాడీల వివరణ

మచిలీపట్నంలో...

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అంగన్వాడి కార్యకర్తలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కష్ణా కలక్టరేట్ ధర్నా చౌక్ లో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 38 వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఎల్ఐసి, ఏఓఐ డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు వై రామ్మోహన్ రావు కె. రాజారావు, కె గుప్తా తదితరులు సంఘీభావం తెలియజేశారు. ఈ సమ్మెలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యునియన్ మచిలీపట్నం సెక్టార్ అధ్యక్ష ,కార్యదర్శులు నాంచారమ్మ, పి.రెజీనా రాణి,సభ్యులు కే కె.లక్ష్మి ,సుజాత, సౌజన్య, విటలేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కొనసాగిస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు సమాధానం తెలియజేస్తూ పత్రాలను సిడిపిఓకి గురువారం అంగన్వాడీలు సమర్పించారు. అంగన్వాడి సంఘం నాయకులు రమాదేవి, సిఐటియు నాయకులు బేతా శ్రీనివాసరావు, ఆంజనేయులు, అంగన్వాడి సంఘం నాయకులు సాంబ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడులో జరుగుతున్న అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సిఐటీయూ జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి రవి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు తాడంకి నరేష్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు నళినికుమారి, ఎం రేవతి, సెక్టార్ లీడర్ రమాదేవి, సిహెచ్ విజయలక్ష్మి, ఎం కనకరత్నం, కాళిమ్మ, విజయలక్ష్మి, మేరాబి, నాయకులు లక్ష్మీప్రసన్న, భవాని, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి -మొవ్వ :** నిరవధిక సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు అంగన్వాడీలు లిఖిత పూర్వకంగా బదులిచ్చారు. ఈ మేరకు స్థానిక సిడిపిఓ భానుమతి కి తమ జవాబును లిఖితపూర్వకంగా అందించి గురువారం 38వ రోజు సమ్మె కొనసాగించారు. ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు విజయలక్ష్మీ, రాజారత్నం, కోశాధికారి గంగాభవాని తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. **పామర్రు :** పామర్రులో అంగన్‌వాడీల సమ్మెను గురువారం ప్రాజెక్టు నాయకురాలు కె.ఉమారాణి ప్రారంభించారు. అనంతరం షోకాజ్ నోటీసులకు సమాధానపత్రాలను సిడిపిఒకు అందజేశారు. రత్నశ్రీ, పద్మజ, చిన్నారి, ఉమాదేవి, ప్రజా సంఘాల నాయకులు విల్సన్, కాటూరు నాగభూషణం, మన్నే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో...

కంకిపాడులో...

మొవ్వలో...

పవన్ కళ్యాణ్‌ను కలిసిన వెంకట శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డకు చెందిన పారిశ్రామికవేత్త పలు నిర్మాణ సంస్థల అధినేత వికుర్తి వెంకట శ్రీనివా సరావు గురువారం జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను కలిశారు. తాను జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధపడు తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. గతంలో 2004 కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన సందర్భంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్‌లోని మంత్రి పొన్నాల లక్ష్మయ్యకు పిఏగా పనిచేయడంతో పాటు ఎక్కువ కాలం ఆయనతో కొనసాగారు. ఈ సందర్భంలో అనేక నిర్మాణ కంపెనీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో రాఘవా కన్స్ట్రక్షన్, వివిఆర్ ఇన్రా, రాఘవ ఇన్రా, జయలక్ష్మి డిస్ట్రిబ్యూటర్స్ కంపెనీలకు ఎండిగా డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఇవి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ నిర్మాణ రంగంలో కొనసాగు తున్నాయి. కాగా అవనిగడ్డ స్వగ్రామం కావడంతో జనసేన పార్టీలో చేరి జనసేన టిడిపి అలయన్స్ లో అవనిగడ్డ సీటును ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ సమక్షంలో త్వరలోనే పార్టీలో చేరినన్నట్లు శ్రీనివాసరావు చెప్పారు.

పవన్ కళ్యాణ్‌తో వెంకట శ్రీనివాసరావు

ఏఎంసీ చైర్మన్ దంపతులను అభినందిస్తున్న నాయకులు

ఎఎంసి చైర్మన్ కరుణకు అభినందన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఏఎంసీ చైర్మన్ తోట కరుణ వెంకయ్య దంపతులను గురువారం పలువురు ప్రముఖులు కలిసి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. వీఆర్వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అర్జునరావు, కాపు ఐక్య సమ్మేళనం నాయకులు గోపిశెట్టి వీరాస్వామి, వైసీపీ నాయకులు యర్రం శెట్టి రామాంజనేయులు, పామర్తి మాధవరావు, నక్క చిన్ని, పెద్దలు వెంకటేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు. అదేవిధంగా దావాజీగూడెం గ్రామానికి చెందిన సిఅర్‌పి వెంకట్ కరుణ దంపతులకు అభినందనలు తెలిపారు.

మట్టి ఖర్చులకు నగదు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం మాజేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం కలిగి ఇటీవల మరణించిన కొత్త మాజేరు గ్రామానికి చెందిన తమ్ము చంద్రరావు మట్టి ఖర్చుల నిమిత్తం మాజేరు పిఏసిఎస్ రూ.10,000 లను చైర్ పర్సన్ అరజా శివశంకర్ గురువారం చంద్రరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్య క్రమంలో పిఏసిఎస్ సిఇఒ ఎస్ ఎస్ చక్రపాణి, పర్సన్స్ మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న దృశ్యం

గండిగుంటలో మినుము పైరు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చెరకు, మినుము పంటల పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు : గండిగుంటలో మినుము, చెరకు పంటలను జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికా రులు గురువారం పరిశీలించారు. మినుము పైరు పెరుగుతున్న ప్రస్తుత దశలో చీడపీ డలు, తెగుళు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం చెరకు నరికి కర్మాగారానికి రవాణాచేస్తున్న తరుణంలో పాటించ వలసిన మెళకువలు చెరకు పరిశోధనా స్థానం ఉయ్యూరు సీనియర్ శాస్త్రవేత్త డి సుధారాణి తెలియజేశారు. కొత్తగా చెరకు సాగుచేసే వారికి విత్తన శుద్ధి, నాటే సమయంలో చేపట్టవలసిన చర్యలు వివరించారు. ఏడీఏ ఎన్టీసీ జ్యోతిరమణి, ఏఓ పద్మజ, వీఏఏలు పి హేమంత్, నాంచారయ్య, తిరుపతిరావు విజయకష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన

- సేకరించిన సమాచారం మూడంచెల పద్ధతిలో పున:పరిశీలన
- కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో కుల గణన సర్వేలో భాగంగా నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా సర్వే ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. గురువారం ఆయన నగరంలోని తన బంగ్లాలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి కుల గణన సర్వేపై వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి ఈనెల 28 తేది వరకు పది రోజులు పాటు జరిగే ఈ కుల గణన సర్వే ప్రతి సచివాలయ పరిధిలోని వాలంటీర్ల సహకారంతో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తారన్నారు. సేకరించిన ఈ సమాచారం ఫిబ్రవరి 5 నుంచి 15 తేది వరకు మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో సంబంధిత అధికారులతో మూడంచెల పద్ధతిలో పున పరిశీలించటం జరుగుతుందన్నారు. సేకరించిన సమాచారమునకు ఇంటిలోని కుటుంబ యజమాని, వాలంటీర్, సచివాలయ సిబ్బందివారి ధ్రువీకరణే ప్రామాణికమని స్పష్టం చేశారు. కుటుంబంలోని ఇతర సభ్యులు పనుల నిమిత్తం వలస పోవడం, చదువులతో పిల్లలు అందు బాటులో లేకపోవడం వంటి సందర్భాలలో వారి కుటుంబ సభ్యుల వివరాలకు యజమాని ఇచ్చే సమాచారమే తుది ప్రామాణికమని పేర్కొన్నారు. సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేస్తారని, వారిచ్చిన సమాచారమునకు నిరూపణగా ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సిన అవసరం ఏమీ లేదని తెలిపారు. ఎన్నో ఏళ్ల తర్వాత తొలిసారిగా చేపట్టిన ఈ కులగణన సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకోవడానికి ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టిందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు షేక్ షాహిద్ బాబు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు నివాళి

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని గోపువాని పాలెంలో ఎన్‌టి రామారావుకు కృష్ణాజిల్లా తెలుగు మహిళా అధికార ప్రతినిధి మైనేని ఇందిరా నివాళులర్పించారు. యార్లగడ్డ వీరభద్రరావు, యార్లగడ్డ లక్ష్మి, మైనేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

- రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్

మారథాన్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని, శుక్రవారం ప్రారంభించబోయే ఆ మహోన్నత కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రజలందరూ తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారు మూడి విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం సామాజిక సమత సంకల్పం కార్యక్రమం లో భాగంగా, శుక్రవారం విజయవాడలో డా.బి.ఆర్. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ సందర్భంను పురస్కరించుకొని మచిలీపట్నం కోనేరు సెంటర్ నుండి డా. బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ (పాత లక్ష్మి టాకీస్ సెంటర్) డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఘనంగా అర్పించారు. తొలుత రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సోషల్ వెల్ఫేర్ డిడి షేక్ షాహిద్ బాబు,మునిసిపల్ కమీషనర్ చంద్రయ్య, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి ఎస్ ఆర్ ప్రసాద్ తదితర అధికారులు కోనేరు సెంటర్ నుండి మారథాన్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం విక్టర్ ప్రసాద్ మాట్లా డుతూ కులాలు, మతాలకు అతీతంగా పేదలందరి జీవి తాల్లో బాబా సాహెబ్ అంబేద్కర్ వెలుగులు నింపారన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసుకున్న డా. బి.ఆర్ అంబేద్కర్ మహా శిల్పం మన రాష్ట్రానికే కాదు, దేశానికే తలమానికం అని అన్నారు. బడుగు, బలహీన వర్గాలవారు అంబేద్కర్ ను స్పూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి , మచిలీపట్నం మాజీ మునిసిపల్ చైర్మెన్ షేక్ సలార్ దాదా, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి దళిత జాయింట్ ఆక్షన్ కమిటీ చైర్మెన్, రా ష్ట్ర క్రిస్టియానిటీ మైనార్టీ కార్పొరేషన్ సబ్యుడు జక్కుల ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని స్వరాజ్య మైదానంలో చేపట్టిన అంబేద్కర్ విగ్రహం, స్మతి వనం పనులు పూర్తయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి స్వరాజ్యమైదానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ముందుగా మధ్యాహ్నం 4 గంటలకు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభ జరుగుతుంది.

విస్తృత పోలీసు బందోబస్తు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

నగరంలోని స్వరాజ్యమైదానంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 6 నుండి రాత్రి 12 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ కార్యక్రమానికి లక్షన్నర మంది వరకు హాజరయ్యే అవకాశం ఉండడంతో జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. విజయవాడలోని పలు జంక్షన్లలో 36 చోట్ల స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డిజిపి

అంబేద్కర్ స్మతివనం ప్రారంబోత్సవం సందర్భంగా చేసిన భద్రత ఏర్పాట్లను రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. స్టేడియంలో జరిగే సభ ఏర్పాట్లను డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డితోపాటు నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, ఇతర పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఇంకా డిసిపి విశాల్ గున్ని, ఎఐజి ఎం.రవీంద్రబాబు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు మద్దతుగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె కు మద్దతుగా ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సింగ్‌నగర్ పైపుల రోడ్ వద్ద సంతకాల సేకరణ జరిగింది. ఈకార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు గత 38 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి దేవీ కుమారి, బి.అమ్ములు, సి.హెచ్.అరుణ, విజయలక్ష్మి, సావిత్రి, నీరజా, నిర్మల, మాధవి, సుగుణ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

గంజాయి మొక్కలను పెరికేయాలి

మాట్లాడే ఎమ్మెల్యే కొడాలి నాని గుడివాడకు సమస్యగా మారారన్నారు. గుడివాడ బైపాస్ రోడ్‌లో పేదలభూమి 6 ఎకరాలు కబ్జాచేశారన్నారు. పుట్టగుంటలో మట్టి మాయ చేశారన్నారు. క్యాసినో, జూద క్రీడలు నిర్వహించారన్నారు. రోడ్లు అభివద్ధి చేయడం నానికి చేతకాలేదన్నారు. నోరు జారితే ఫలితం అనుభవించాల్సి వస్తుందని నానిని హెచ్చరించారు. నీతులు చెప్పే మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని సత్రం భూములు 1000 గజాలు దేవాలయ భూములు భారీగా ఆక్రమించారన్నారు. బినామీల పేరుతో కత్తివెన్ను మండలంలో 300 ఎకరాలు ఆక్రమించారన్నారు. పామర్రు ఎమ్మెల్యే ఇసుక, మట్టి అమ్ముకోవడంలో దిట్ట అన్నారు. బూతులు తిట్టి తన కార్యాలయంపై దాడి చేసినందుకు జోగికి మంత్రి పదవి ఇచ్చారని, నిన్నటి వరకు ప్రతిపనికి కమీషన్లు దండుకున్న. పెడనను పీడించిన రోగి జోగి రమేష్ అన్నారు. ఈ చెత్తను ఇప్పుడు జగన్ పక్కన పడేశారన్నారు. జోగి చీటి పెడనలో చిరిగిందని, పెనమలూరులోనూ వద్దంటున్నారని అన్నారు. గన్నవరం ఎమ్మెల్యే వంశీ గ్రావెల్, మట్టి అమ్ముకుని వందల కోట్లు సంపాదించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ వైసీపీ నేతలను ఓడించి టీడీపీ, జనసేన నేతలను గెలిలించాలన్నారు. ఈ సభకు టిడిపి శ్రేణులు భారీగా తలివచ్చాయి. గుడివాడ బైపాస్ రోడ్, బంటుమిల్లి రోడ్‌లో జనంతో కిక్కిరిశాయి. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మంత్రులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గుడివాడలో ఉద్రిక్తత

భాగంగానే టిడిపి ఆధ్వర్యాన "రా కదలి రా' కార్యక్రమం నిర్వహించారు. పోటాపోటీగా గుడివాడ సెంటర్‌లో రెండు పార్టీల నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 గంటల సమయంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వెనిగండ్ల రాము ఆ పార్టీ శ్రేణులతో పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు ర్యాలీగా బయలుదేరారు. అదే సమయంలో వైసిపి ఎంఎల్ఎ కొడాలి నాని ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించేందుకు ఆ పార్టీ నేతలు బయలుదేరారు. ఈక్రమంలో టిడిపి, జనసేన - వైసిపి కార్యకర్తలు పరస్పరం ఎదురుపడ్డారు. ఇరువైపులా కార్యకర్తలూ భారీ సంఖ్యలో పోగయ్యారు. టిడిపి, జనసేన - వైసిపి కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. రెండు పార్టీల నేతలు ఒకేసారి ఎదురుపడకుండా ఉండేందుకు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వెళ్తున్న టిడిపి, జనసేన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ వెనిగండ్ల రాము రోడ్డుపై బైఠాయించారు. కొద్దిసేపటి తర్వాత అక్కడి నుంచి ఎంఎల్ఎ వెనుదిరిగి వెళ్లిపోయారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉండడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. గుడివాడ మొత్తం పటిష్ట భద్రతను ఏర్పాటు చేసి శాంతిభద్రతలు అదుపు తప్పకుండా చూశారు. పోలీసుల జోక్యంతో కొద్దిసేపటికి పరిస్థితి సద్దుమణిగింది. ఇరువర్గాలు శాంతించాయి. అనంతరం టిడిపి నేతలు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వెళ్లి నివాళులర్పించారు.

ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి డిఇఒగా తహెర సుల్తానా

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారిగా తహెర సుల్తానాను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలంయలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును మర్యాద పూర్వకంగా కలిశారు. కష్ణాజిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె... ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారిణిగా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. ప్రస్తుత డిఇఒ సీవీ రేణుక సెలవులో ఉన్న కారణంగా తహెర సుల్తానాకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

CHANGE OF NAME

I. **SEELAM PRATHAPAREDDY** (Old Name) S/o. **KRISHNA REDDY,** resident of D.No.5-165, Chandragudem Village, Mylavaram Mandal, N.T.R Dist., I have changed my name as **SEELAM PRATAP REDDY** (New Name). Hereafter my name is known as **SEELAM PRATAP REDDY** (New Name).

IN THE COURT OF THE MACT, Vth ADDL. DIST JUDGE: AT: KOTHAGUDEM
MATOP NO 8 /2022

BETWEEN
Shaik Yakub @Yakub Ali
... Claim Petitioner
AND
V.Durga Prasad and Others...Respondents
To
Respondent No.1
1.V.Durga Prasad S/O Rangarao
Occu: Owner of the Lorry R/O H. No 2-83 Velama bazar , Rayanapadu , Guntupally B.O Krishna Dist.

NOTICE

Take notice that the above named claim petitioners filed the above OP against you and others for grant of compensation and the same is posted to 30-1-2024 for your appearance . You are hereby directed to appear before the Hon'ble Court on or before 30-1-2024 at 10:30 A.M in person or through an advocate without fail. If you failed the matter will be decided exparte against you

//By order of the court//
TELLAKULA RAMESH BABU
P. RAJASEKHAR
ADVOCATES, KHAMMAM
CELL : 74167 60892

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No : 420/20
IN
O.S No : 76/12

బెల్లం పొలురాజు ...... పిటిషనర్
వర్సెస్
కాట్రగడ్డ వెంకట అనిల్ కుమార్ మరికొందరు
..... రెస్పాండెంట్స్

నోటీసు

To :
R3 నర్రా శ్రీలక్ష్మి, భర్త గోపీచంద్
R/o ఆనంద్ సాయి నిలయం, అసోసియేట్ బిల్డర్స్
D.No: 304, అశోక్ నగర్, దనేకులవారి వీధి
విజయవాడ -7

పై నంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్ పిటిషనరు దాఖలా చేసి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని, శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేదీ 02-02-2024 ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకునేది. లేనిచో పిటీషన్ ను మీ పరోక్షంగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
మోతుకూరి సుభాష్ బాబు,
మురకొండ చంద్రశేఖర్
న్యాయవాదులు,అద్దంకి

IN THE COURT OF THE 1ST ADDL. DISTRICT JUDGE : KRISHNA, MACHILIPATNAM
G.W.O.P. No. 83/2023

In the matter of Kothamasu Gagan Vijeth, Hindu, age 15 years, (Minor), S/o Kothamasu Indumathi, Hindu, resident of D.No. 54-13-35, Flat SF-2, Plot No.393, Sri Sai Soudha Apartment, Main Road, Srinivas Nagar, Bank Colony, Vijayawada, NTR District.
Between :
Grandhi Kishore Babu ... Petitioner
And
Assistant Director, D.D.O. of Govt. General Hospital Vijayawada & another
.... Respondents

పై నెంబరు G.W.O.P. ని మైనర్ పిటీషన్ అయిన కొత్తమాసు గగన్ విజిత్ దత్తత తీసుకున్న తల్లిగారు అయిన కొత్తమాసు ఇందుమతి గారు ది. 20-5-2023 తేదీన గవర్నమెంట్ హాస్పిటల్ నందు స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తూ మరణించినారు. మరణించిన కొత్తమాసు ఇందుమతి గారి డెత్ బెనిఫిట్స్‌ను మైనర్ పిటీషనర్ అయిన కొత్తమాసు గగన్ విజిత్ నామినిగా సర్వీస్ రిజిష్టర్‌లో చేర్పించి సదరు బెనిఫిట్స్‌ను కొత్తమాసు గగన్ విజిత్, వారికి గార్డియన్ అయిన గ్రంధి కిషోర్‌బాబు మైనర్ పిటీషనర్ అయిన వెల్ఫేర్ నిమిత్తం తీసుకొనుటకు గాను పై నెంబరు ఓ.పి.ని దాఖలు చేయడం అయినది. సదరు పై విషయములపై ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు వున్న యెడల ది. 2-2-2024 తేదీన పై కోర్టువారి యెదుట ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెనని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.
హియరింగ్ తేది : 2-2-2024

ఇట్లు
కె.వి.సాయిబాబు,
పిటీషనర్ తరపు అడ్వకేటు,
మచిలీపట్నం. మచిలీపట్నం.
తేది : 18-1-2024 సెల్ : 93983 76556

వేలం ప్రకటన
మహారాజశ్రీ 3వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి, విజయవాడ వారి కోర్టులో
ఇ.పి.నెం. 89/2022 ఇన్ ఓ.యస్. నెం. 507/2017

బిట్వీన్ :
కోవెల ఎర్రయ్య ... పిటీషనరు/ డిహెచ్ఆర్
మరియు
కట్టా నాగరాజు, తండ్రి స్వాములు, డోర్ నెం. 126/11, కామయ్యతోపు బ్రిడ్జిడౌన్ రోడ్డు, శ్రీనివాసనగర్, తాడిగడప గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా ... రెస్పాండెంట్ / జె.డి.ఆర్.

డిహెచ్ఆర్ యొక్క బాకీ వసూళ్ల నిమిత్తం పై కోర్టులో ది. 24-1-2024న ఉదయం 10-30 గం.లకు జెడిఆర్‌కు సంబంధించిన ఈ క్రింది ఆస్థి అమ్మకము మరియు వేలము నిర్వహించబడును. ఆసక్తి గల బిడ్డర్లు పాల్గొని పాడుకోగలరని ఇందుమూలంగా యావన్మందికి తెలియపర్చడమైనది.

షెడ్యూలు

కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామపంచాయతీ పరిధిలోని డాక్యుమెంట్ నెం. 1840/1999గా గల డోర్ నెం. 6-2, రీ.సర్వే నెంబరు 296/1, ప్లాటు నెం.9 లో గల చ.గ. 209 ఖాళీ స్థలమునకు హద్దులు. తూర్పు : ప్లాటు నెం.10, దక్షిణం : 33 అడుగుల రోడ్డు, పడమర : ప్లాటు నెం.8, ఉత్తరం : ప్లాటు నెం. 12 మరియు రోడ్డు.
యీ నాలుగు హద్దుల మధ్య గల చ.గ. 209 ఖాళీ స్థలము.
డిక్రీ హోల్డరు విలువ : రూ.10,00,000/-లు
అమీనా విలువ : రూ.8,50,000/-లు
మార్కెట్ విలువ : రూ. 8,50,000/-లు
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వేలముతేది : 24-1-2024
ఫరదర్ హియరింగ్ : 07-02-2024

ఇట్లు
యస్.కె.రహిమాన్, అడ్వకేట్,
పోరంకి, విజయవాడ.
సెల్ : 9705726440

మహారాజశ్రీ విజయవాడ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఎ.ఎస్.నెం. 93/2019

బిట్వీన్:
నెప్పలి వెంకట సత్యనారాయణ ... అప్పిలెంటు
అండ్
నెప్పలి నాగేంద్రమ్మ మరియు ఇతరులు...రెస్పాండెంట్లు
నోటీస్ టూ :
నెప్పలి నాగేంద్రమ్మ, భర్త : నెప్పలి వెంకట సత్యనారాయణ, అడ్రస్ : వల్లూరి సాంబశివరావుగారి ఇల్లు, డోర్ నెం. 40-12-3/4, సీతారామనగరం, పటమటలంక, విజయవాడ.

పై నెంబరు దావా /అప్పీల్‌లో 1వ ప్రతివాది అయిన మీకు పై కోర్టువారి నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపిన తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున కోర్టువారు ప్రత్యామ్నాయ సర్వీసుగా పేపరు ప్రకటన ద్వారా సమన్లు ఆర్డరు చేసియున్నారు. కావున సదరు ప్రతివాదిపై నెంబరు ఐ.ఎ. నందు 30-1-2024 తేదీన ఉదయం 10-30 గం.లకు కోర్టువారి ముందు మీరు స్వయంగా గానీ, పై తరఫున న్యాయవాది ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని తెలియ జేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 30-1-2024

ఇట్లు
బి.హెచ్.ఫణిశ్రీ
వాది తరఫున న్యాయవాది,
విజయవాడ.

మహారాజశ్రీ విజయవాడ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. నెం. 491/2019 ఇన్ ఎ.ఎస్.నెం. 93/2019

బిట్వీన్:
నెప్పలి వెంకట సత్యనారాయణ...పిటీషనర్/అప్పిలెంటు
అండ్
నెప్పలి నాగేంద్రమ్మ మరియు ఇతరులు
... రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు
నోటీస్ టూ :
నెప్పలి నాగేంద్రమ్మ, భర్త : నెప్పలి వెంకట సత్యనారాయణ, అడ్రస్ : వల్లూరి సాంబశివరావుగారి ఇల్లు, డోర్ నెం. 40-12-3/4, సీతారామనగరం, పటమటలంక, విజయవాడ.

పై నెంబరు ఐ.ఎ.లో 1వ ప్రతివాది అయిన మీకు పై కోర్టువారి నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపిన తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున కోర్టువారు ప్రత్యామ్నాయ సర్వీసుగా పేపరు ప్రకటన ద్వారా సమన్లు ఆర్డరు చేసియున్నారు. కావున సదరు ప్రతివాదిపై నెంబరు ఐ.ఎ. నందు 30-1-2024 తేదీన ఉదయం 10-30 గం.లకు కోర్టువారి ముందు మీరు స్వయంగా గానీ, పై తరఫున న్యాయవాది ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని తెలియ జేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 30-1-2024

ఇట్లు
బి.హెచ్.ఫణిశ్రీ
వాది తరఫున న్యాయవాది,
విజయవాడ.

మహారాజశ్రీ విజయవాడ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ. నెం. 492/2019 ఇన్ ఎ.ఎస్.నెం. 93/2019

బిట్వీన్:
నెప్పలి వెంకట సత్యనారాయణ...పిటీషనర్/అప్పిలెంటు
అండ్
నెప్పలి నాగేంద్రమ్మ మరియు ఇతరులు
... రెస్పాండెంట్లు/ రెస్పాండెంట్లు
నోటీస్ టూ :
నెప్పలి నాగేంద్రమ్మ, భర్త : నెప్పలి వెంకట సత్యనారాయణ, అడ్రస్ : వల్లూరి సాంబశివరావుగారి ఇల్లు, డోర్ నెం. 40-12-3/4, సీతారామనగరం, పటమటలంక, విజయవాడ.

పై నెంబరు ఐ.ఎ.లో 1వ ప్రతివాది అయిన మీకు పై కోర్టువారి నుండి ఎన్ని పర్యాయములు సమన్లు పంపిన తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున కోర్టువారు ప్రత్యామ్నాయ సర్వీసుగా పేపరు ప్రకటన ద్వారా సమన్లు ఆర్డరు చేసియున్నారు. కావున సదరు ప్రతివాదిపై నెంబరు ఐ.ఎ. నందు 30-1-2024 తేదీన ఉదయం 10-30 గం.లకు కోర్టువారి ముందు మీరు స్వయంగా గానీ, పై తరఫున న్యాయవాది ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడునని తెలియ జేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 30-1-2024

ఇట్లు
బి.హెచ్.ఫణిశ్రీ
వాది తరఫున న్యాయవాది,
విజయవాడ.

సహాయ ఫౌండేషన్ కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థ సహాయ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీ యమని కృష్ణా యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ వీరబ్రహ్మాచారి అన్నారు. గురువారం మచిలీపట్నం సహాయ ఫౌండేషన్ సేవా క్యాంటీన్ ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో న్యాయ నిర్ణేతలుకి సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మాచారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా చేయడం జీవితంలో బాధ్యతగా ఏర్పాటు చేసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలకు విద్యార్థిదశ నుండి అలవాటు చేయాలని అన్నారు. సహాయ పౌండేషన్ గత ఐదు సంవత్సరాలుగా 1300 పైగా సేవా కార్యక్రమాలు చేసి ఇప్పటికే రెండుసార్లు ఉత్తమ సేవా సంస్థగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిందని అన్నారు.లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ కష్ణా జిల్లాలో ఏ స్వచ్ఛంద సంస్థ చేయని విధంగా సహాయ ఫౌండేషన్ సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల చేసిన కార్యక్రమాలు ప్రజల మన్ననలుపొందిందని అన్నారు. సహాయఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్ బాషా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరిగిన సంగీత,నత్య, ఫ్యాన్సీ డ్రెస్సులు, ముగ్గులు, మెహందీ పోటీలలో400 మంది పైగా పోటీలలో పాల్గొన్నారని సుమారు 3000 మంది ఈ కార్యక్రమాలకు హాజరైనట్లు తెలియజేశారు. పోటీలలో న్యాయ నిర్నేతలుగా వ్యవహరించిన కాళీపట్నం ఉమా,డాక్టర్ విజయలక్ష్మి ,ఏ శ్యామల, డాన్స్ పోటీలలో జడ్జెస్ గా వివరించిన నాగేంద్రబాబు,అశ్విని కుమార్,అఖిల, పూర్ణచంద్రరావు మాస్టర్ లను ముగ్గుల పోటీలలో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన శ్రీకాకుళం రాణి ఘంటసాల కుమారి మెహందీ పోటీలలో జరీనా షాన్ మరియు స్వాతిని ఫాన్సీ డ్రెస్ కాంపిటేషన్లో సుకన్య మరియు జ్యోతి లను సన్మానం చేసి మెమెంటోలు అందచేశారు. సహాయ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను అభినందిస్తూ కష్ణ యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ బ్రహ్మాచారి 5,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి తాను కూడా సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం కార్యదర్శి నూర్జహాన్,కోశాధికారి ఎం.లక్ష్మీకాంతం,తోట విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ నిర్ణేతలను సన్మానిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు నుంచి తరలుతున్న నాయకులు, కార్యకర్తలు

గుడివాడ సభకు తరలిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుడివాడలో ఏర్పాటు చేసిన రా కదిలిరా బహిరంగ సభకు గుడ్లవల్లేరు మండలం నుండి భారీ సంఖ్యలో అభిమానులు కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని 22 గ్రామ ల ప్రజలు ఆటోలు, బైకులు, ట్రాక్టర్లు, కార్లలో భారీ సంఖ్యలో బహిరంగ సభకు తరలి వెళ్లారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** పెదపారుపూడి మండలం నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున గుడివాడ తరలివెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో రెండు వందల ఆటోలు, 500 బైక్‌లతో భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరపనేని వెంకట సత్యనారాయణ, కార్యదర్శి మసి ముక్కు రాంబాబు, కూచిపూడి సుబ్బయ్య పాల్గొన్నారు.

పెదపారుపూడి మండలం నుంచి తరలిన నాయకులు, కార్యకర్తలు

ఆరోగ్య సురక్ష నిర్వహణలో కృష్ణాకు మొదటిస్థానం

- కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులలో సరాసరి ఓపీ 474 మందితో జిల్లా మొదటి స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీ సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుండి సిఎస్ గారి విసిలో పాల్గొని జిల్లా ప్రగతి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ప్రగతికి సంబంధించి జిల్లాలో ఇప్పటిదాకా 68 క్యాంపులు నిర్వహించగా 32,201 మందికి ఓపీలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సరాసరి ఓ పి 474 మందితో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మొదటి దశ నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలలో ఆరోగ్యశ్రీ కింద తదుపరి చికిత్స పొందుటకు రెఫర్ చేసిన 3028 కేసులలో నూరు శాతం వైద్య చికిత్స అందిం చుటకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీ శుక్రవారం విజయవాడ స్వరాజ్య మైదానంలో జరిగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహా విష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లేందుకు 180 ఆర్టీసీ బస్సులతో పాటు 72 ప్రైవేట్ బస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ పెద్ది రోజా, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి, పిడి ఐసిడిఎస్ సువర్ణ, కలెక్టరేట్ ఏవో రాధిక పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : ఎంపిపి

ప్రజాశక్తి-ఉంగుటూరు : గత నాలుగు సంవత్సరాల కాలంలో తేలప్రోలు 1,2 సచివాలయాల పరిధిలోగల లబ్ధిదారులకు 75 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందించారని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. గురు వారం మండలంలోని తేలప్రోలు గ్రామంలో జగనే ఎందుకు కావాలి కార్యక్ర మంలో భాగంగా సర్పంచి లాం దిబోరా అధ్యక్షతన జరిగిన సభలో సరోజిని మాట్లాడారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఎన్నడూ లేని విధంగా తేలప్రోలులో అభివృద్ధి జరిగిందన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఇంత శంకర్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బడుగు బలహీన వర్గాల అభివద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, ,ఎంపీటీసీ తియ్యగూర వాణి, ఆత్కూరు ఎంపీటీసీ అర్నేపల్లి సింహాచలం, వింత శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆటల పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో ఆడుదాం ఆంధ్రా పోటీలు కొనసాగుతున్నాయి. షటిల్ బాడ్మింటన్ విభాగంలో వీరపనేనిగూడెం జట్టు తెంపల్లి జట్టుపై గెలుపొందింది. అలాగే కేసరపల్లి గన్నవరం 3పై, అజ్జంపూడి గన్నవరం1పై, చిన్న ఆవుటపల్లి గన్నవరం 2 జట్టుపై గెలిచాయి. మహిళల విభాగంలో బుద్దవరం 2 జట్టు కొండపావులూరుపై, వీరపనేనిగూడెం సూరంపల్లిపై గెలుపొంది పురుషులు, మహిళా జట్లు సెమీఫైనల్ రౌండ్ కు చేరుకున్నాయి. బుద్దవరం 2 జట్టు సూరంపల్లి పై గెలుపొందింది. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** మండల స్థాయి క్రికెట్ పోటీల్లో మేడూరు టీంపై ఆగినపర్రు సచివాలయం పరిధిలోని గంఢ్రపువాని గూడెం జట్టు విజయం సాధించిదని ఇన్చార్జి ఎండిఒ కొండేటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పమిడిముక్కల ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ విజేతలకు బహుమతులందజేశారు. వైఎస్ఆర్ పార్టీ మండల అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, పీఈటి రవీంద్ర, కొడమంచిలి మహేష్, మామిడిపల్లి సర్పంచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలోని క్రికెట్ జట్లు డోకిపర్రు జిల్లా పరిషత్ హైస్కులు గ్రౌండ్స్ లో గురువారం పోటీలు పడ్డాయి. ఎంపీపీ కొడాలి సురేష్ , ఇన్ చార్జ్ మండల పరిషత్ అభివద్ధి అధికారి వి. దిలీప్‌కుమార్, మండల తహశీల్దారు అబ్దుల్ రెహమాన్ మస్తాన్, సర్పంచ్ జ్యోతిలత పాల్గొన్నారు.

గన్నవరంలో టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

పమిడిముక్కల మండలంలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఓటర్లను చైతన్యవంతం చేయాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జాతీయ ఓటర్ల దినోత్సవం వినూత్న రీతిలో పెద్ద ఎత్తున నిర్వహించి ఓటర్లను చైతన్యవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలకు సూచించారు. జిల్లా కలెక్టర్ గురువారం వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి 2024 ఫోటో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ, జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణ, రాబోయే ఎన్నికలలో పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాల కల్పన తదితర అంశాల పై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను చైతన్యవంతం చేయుటకు జిల్లాలో పెద్ద ఎత్తున ర్యాలీలు, మానవహారాలు, యువ ఓటర్లకు, 80 సం దాటిన వద్ధ ఓటర్లకు సత్కారాలు, యువ ఓటర్లకు ఓటర్ ఐడి కార్డులు పంపిణీ, పాఠశాల కళాశాల విద్యార్థులకు, డ్రాయింగ్, వ్యాసరచన, వక్తత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈసారి ఎన్నికలలో పోలింగ్ శాతం పెంపు చేయడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం అన్నారు.పోలింగ్ కేంద్రాల వెరిఫికేషన్ పై కలెక్టర్ సమీక్షిస్తూ పోలింగ్ కేంద్రాలన్నింటిలో ఫర్నిచర్ , రాంపులు, టాయిలెట్స్, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు కల్పన పనులు ఎంతవరకు వచ్చాయని ఆరా తీశారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన నమూనా పోలింగ్ కేంద్రం మాదిరిగా ఆయా డివిజన్లలో కూడా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం ఈనెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నిర్వహించు వీడియో కాన్ఫరెన్స్ అజెండా అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.జూమ్ కాన్ఫరెన్స్లో డిఆర్ఓ పెద్ది రోజా, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రూ.3.23 కోట్ల చెక్కు అందజేత

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : వైఎస్ఆర్ నవ రత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం కింద జిల్లాలో 23,270 మంది లబ్ధిదారులకు రు.3.23 కోట్లను వడ్డీ తిరిగి చెల్లింపు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు.గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి లోని వారి క్యాంపు కార్యాలయం నుండి నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద అర్హులైన 4,07,323 మంది లబ్ధిదారులకు రు.46.90 కోట్ల వడ్డీ రియంబర్స్మెంట్ను బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు.ఈ సందర్భంగా నగరంలోని కలెక్టరేట్ విసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, డి ఆర్ డి ఎ పి డి, పిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా ఇంఛార్జి హౌసింగ్ అధికారి జీవీ సూర్యనారాయణతో కలిసి పాల్గొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్టీసి జోనల్ చైర్మన్ తో కలిసి 23,270 మంది లబ్ధిదారులకు 3.23 కోట్ల రూపాయల మెగా నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలను పేదలకు ఉచితంగా అందించడమే కాకుండా ఇంటి నిర్మాణానికి యూనిట్కు రు.1.80 లక్షల చొప్పున లబ్ధిదారులకు అందివ్వడమే కాకుండా ఉచిత ఇసుక ఇవ్వటం ద్వారా 15 వేల రూపాయలు, సిమెంటు స్టీలు మెటల్ ఫ్రేమ్లు ఇంకా ఇతర నిర్మాణ సామాగ్రి తక్కువ ధరలకు అందించడంతో ఇంకో 40 వేల రూపాయల మేరకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఈ ఈ వెంకట్రావు డిఈ రమేష్ బాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గుడివాడకు నాని చేసింది శూన్యం : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడరూరల్ : గత 20 ఏళ్లుగా గుడివాడకు ఎమ్మెల్యే కొడాలి నాని చేసింది శూన్యమని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ మండలం మల్లాయపాలెం గ్రామం అలంకృత ఫంక్షన్ హాలు ఎదురుగా తెలుగుదేశం పిలుస్తోంది రా కదలి రా కార్యక్రమంతో పాటు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్న ఈ కార్యక్రమంలో వెనిగండ్ల మాట్లాడారు. నేల ఈనిందా అన్నట్టుగా తెదేపా అభిమానులు తరలివచ్చారన్నారు. తాను 2000 ఉద్యోగాలు ఇప్పించానని చంద్రబాబునాయుడు తోడుగా ఉంటే పది వేల ఉద్యోగాలు ఇప్పిస్తానన్నారు. పేదరికం నుంచి బయటకు రావాలంటే అది పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: నేడు అనుభవిస్తున్న రాజ్యాంగబద్ధమైన హక్కులకు ఆద్యుడు, భారతదేశ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన ఒక మహనీయుని జ్ఞాపకాన్ని విగ్రహం రూపంలో దేశంలో ఎక్కడా లేని విధంగా మన జిల్లాలో ప్రతిష్ఠించడం జిల్లా ప్రజలందరికీ గర్వకారణం అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కానున్న భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వస్తున్న 1.50 లక్షల మంది ప్రజలకు ఆతిథ్యం ఇవ్వటం మన బాధ్యత అన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే చిన్న చిన్న ఇబ్బందులను నగర ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. ఈ విగ్రహం గొప్పదనం గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విగ్రహ ప్రతిష్ఠ పరిసర ప్రాంతాలలో వాహనాల రాకపోకల్లో కొన్ని మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా వాహనదారులు ప్రయాణ మార్గాన్ని మార్చుకోవాలని సూచించారు. రాష్ట్రం మొత్తం నుంచి ఆర్టీసీ బస్సులు 2,500 లతోపాటు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు.

విగ్రహావిష్కణ సభకు పూర్తిస్థాయిలో బందోబస్తు : సిపి

విజయవాడ ఇందిరా గాంధి మున్సిపల్ స్టేడియంలో జరుగు "సామాజిక న్యాయ డా. బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ" ప్రారంభోత్సవ సభ కార్యక్రమ అనంతరం స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతివనాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రారంభిస్తున్న నేపధ్యంలో గురువారం నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా , ఇతర పోలీసు అధికారులతో కలిసి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో బందోబస్త్ విధులు నిర్వహించడానికి వచ్చిన సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ కాంతిరాణాటాటా సిబ్బందితో మాట్లాడుతూ డాక్టర్ బిఆర్అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి , పలువురు ఎమ్.పిలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర వి.ఐ.పి.,లు , ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం బందోబస్తులో పాల్గొనే అధికారులు , సిబ్బంది వారికి కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహించి ,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది వారికి కేటాయించిన పాయింట్లలో అప్రమత్తంగా ఉండాలని, వీక్షకులుకు, ఆహ్వానితులకు వారికి కేటాయించిన ప్రకారము వారు వెళ్లవలసిన మార్గాలును నిర్దేశిస్తూ చెప్పాలన్నారు. ఎక్కడైనా వాహనాలు బ్రేక్ డౌన్ అయినట్లయితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు, పై అధికారులుకు గాని వెంటనే తెలియజేయాలన్నారు. స్టేడియం లోపలకు వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఆ తరువాత మాత్రమే సభా ప్రాంగణం లోనికి అనుమతించాలని సి.పి ఆదేశించారు. అలాగే ముఖ్య ప్రాంతాలలో ,

ముఖ్య జంక్షన్‌లలో ఎక్కడా ట్రాఫిక్ అంతరాయాలు కలుగకుండా ఉండేందుకు సిబ్బందిని అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు తమ వాహనాలు పార్కింగ్ ప్రదేశాల్లోనే పార్కింగ్ చేసేటట్లు చూడాలని అన్నారు. వి.ఐ.పి, వి.వి.ఐ.పి రోడ్లలలో ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలన్నారు. పోలీసు సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేసి ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. శుక్రవారం బందోబస్తు కార్యక్రమానికి 13 మంది ఎస్‌పిలు 12 మంది ఎడిసిపిలు, 46 మంది ఎసిపిలు, 155 మంది ఇన్స్పెక్టర్లు, 290 మంది సబ్-ఇన్స్పెక్టర్లు, 3730 మంది సిబ్బంది మొత్తం 4246 మందితో పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా తోపాటు, డి.సి.పి.లు విశాల్ గున్ని , ఎం.రవీంద్రబాబు, అజిత వేజెండ్ల పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్యం విగ్రహ ప్రారంభోత్సవం చేయనున్న సందర్భగా శుక్రవారం ఉదయం 11 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు విజయవాడ నగరములో వాహనముల రాకపోకల మళ్లింపులు, ఆర్ టి.సి. బస్సుల మళ్లింపులో చేసిన మార్పులను గమనించి వాహనదారులు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, నగర పోలీసు కమిషనర్ కాంతిరాణాటాటా తెలిపారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం వద్ద నుండి జి కొండూరు- మైలవరం- నూజివీడు -హనుమాన్ జంక్షన్ వైపుకు మళ్లించామన్నారు. చెన్నై నుండి విశాఖపట్నం వైపుకు హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా గుడివాడ పామర్రు అవనిగడ్డ- రేపల్లె- బాపట్ల - చీరాల - త్రోవగుంట ఒంగోలు జిల్లా మీదుగా మళ్లించినట్లు తెలిపారు. విశాఖపట్నం నుండి వచ్చు ఆర్.టి.సి. బస్సులు రామవరప్పాడు రింగు-మహానాడు జంక్షను నోవోటెల్ హెూటల్ వద్ద బెంజి సర్కిలు పాత ఫ్లైఓవేర్ మీదుగా - స్క్రూ బ్రిడ్జి -వారధి జంక్షను నుండి పి.యన్.బి.యస్.కు వెళ్ళవలసి ఉంటుందన్నారు. మచిలీపట్నం నుండి వచ్చు ఆర్.టి.సి. బస్సులు తాడిగడప నుండి 100 అడుగులు రోడ్డు ఎనికేపాడు ప్రసాదంపాడు -రామవరప్పాడు రింగు -మహానాడు జంక్షను - నోవోటేల్ హోటల్ వద్ద బెంజి సర్కిలు పాత ఫ్లైఒవేర్ మీదుగా - సూబ్రిడ్జి - వారధి జంక్షను నుండి పి. యన్.బి.యస్.కు వెళ్లాలన్నారు. పి.యస్.బి.యస్ నుండి విశాఖపట్నం వెళ్ళు ఆర్.టి.సి బస్సులు పి.సి.ఆర్. జంక్షను - ప్రకాశం విగ్రహం జంక్షను, కుడివైపుకు తిరిగి పాత గవర్నమెంట్ ఆసుపత్రి రోడ్డు, ఏలూరు లాకులు, జి.యస్.రాజు రోడ్డులో సీతన్నపేట సిగ్నల్ జంక్షను వద్ద నుండి బి.ఆర్.టి.యస్. రోడ్డు లో శారద కాలేజీ జంక్షను, ఫుడ్ జంక్షను, పడవల రేవు జంక్షను, గుణదల, రామవరప్పాడు రింగ్ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లాలని తెలిపారు. పి.యన్.బి.యస్ నుండి మచిలీపట్నం మరియు గుడివాడ వెళ్ళు ఆర్.టి.సి.బస్సులు పి.సి.ఆర్. జంక్షను ఆర్.టి.సి. వై జంక్షను, చల్లపల్లి బంగ్లా హనుమాన్ పేట-ఏలూరు లాకులు -సీతన్నపేట గేటు వద్ద బి.ఆర్.టి.యస్. రోడ్డు మీదుగా పడవల రేవు -గుణదల -రామవరప్పాడు రింగ్ వద్ద నుండి ఎనికెపాడు జంక్షను వద్ద నుండి తాడిగడప 100 అడుగులు రోడ్డు మీదుగా వెళ్లాలని వివరించారు. బెంజ్ సర్కిలు నుండి బందరు రోడ్డు మీదుగా పి.సి.ఆర్ వైపుకు వెళ్ళు సిటీ బస్సులు బెంజి సర్కిలు నుండి ఫకీరుగూడెం జంక్షను, స్క్రూబ్రిడ్జి, వారధి జంక్షను, పి.యన్.బి.యస్.కు చేరుకోనవలసి ఉంటుందన్నారు.పి.యన్.బి.యస్ సిటీ బస్ టెర్మినల్ నుండి ఇబ్రహింపట్నం వెళ్ళు సిటీ బస్సులు- పి.యన్.బి.యస్.మధ్య గేటు నుండి- రాజీవ్ గాంధీపార్కు-కనకదుర్గా ఫ్లైఒవర్ - స్వాతి జంక్షన్ నుండి ఇబ్రహింపట్నం వైపుకు వెళ్ళ వలయును.బెంజ్ సర్కిల్ నుండి పోలీసు కంట్రోలు రూమ్ వరకూ మరియు పోలీసు కంట్రోలు రూమ్ నుండి బెంజ్ సర్కిల్ వరకు బందరు రోడ్డు పై డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ సభకు వచ్చు వాహనములు తప్ప ఏ విధమైన ఇతర వాహనములు అనుమతించబడవు. అదే విధముగా రూట్ నెం 5 లో డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ సభకు వచ్చు వాహనములు మాత్రమె అనుమతించబడును. విజయవాడ ఏలూరు రోడ్డు సీతారామపురం సిగ్నల్ జంక్షను (దీప్తి జంక్షన్) నుండి రెడ్ సర్కిల్ వరకు డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ సభకు వచ్చు వాహనములు తప్ప ఏ విధమైన వాహనములు అనుమతించబడవన్నారు. శిఖామణి సెంటర్ నుండి వాటర్ ట్యాంక్ రోడ్డు లోనికి బందరు రోడ్డు వైపుకు ఏవిధమైన వాహనాలు అనుమతించబోరన్నారు.

'ప్రజ్ఞ వికాసం' గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ అధ్వర్యంలో ప్రజ్ఞ వికాసం పరీక్షకు సంబంధించిన గోడ పత్రికను కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు చేతుల మీదుగా విజయవాడ స్థానిక బాలోత్సవ భవన్ లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞ వికాసం పేరుతో పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్నారు., నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత పరీక్ష పేపర్ తయారు చేయించడం జరిగిందని అన్నారు. విద్యార్థులు ఈ పరీక్ష రాయడం ద్వారా పబ్లిక్ పరీక్షలలో అధిక మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కావున విద్యార్థిని, విద్యార్థులు అందరూ పరీక్షను ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ నేల 29వ తేదీన సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 3:30 వరకు జరుగుతుందనీ ఆయన తెలిపారు. వివరాల కొరకు: 9394755525, 8790865130, 9010849524 ఈ నంబర్ లకు సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సి హెచ్.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుందరయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, సి హెచ్.రాజ్ కుమార్, టి.కుమార్ స్వామి పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందచేత

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక 44వ డివిజన్‌లోని 158 సచివాలయం పరిధిలో నాలుగు స్తంభాల సెంటర్ వద్ద కొండ ప్రాంతంలో నివసిస్తున్న పుసర్ల శివ (34) కొండపైన మెట్ల నుండి జారిపడి మతి చెందడం జరిగింది. మృతుడు శివ తాపీపని చేసుకుంటూ తన భార్య ,ఇద్దరు కుమార్తెలతో జీవిస్తూ ఉంటాడు. కాగా గురువారం మృతుడు శివ భార్య పావనికి జగనన్న భీమా ఐదు లక్షల రూపాయలు క్లైమ్ అవడం జరిగింది. దీనిలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంభ జోజి, సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ జగదీష్,వాలంటరీ సునీత తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-విజయవాడ: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 'జగనన్నకు చెబుదాం' కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా స్థానిక రాణిగారితోట సుందరయ్య గ్రంథాలయం సెంటర్‌లో

సిఐటియు తూర్పు సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా రంగాలకు చెందిన ఉద్యోగ, కార్మికుల నుంచి నాయకులు సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు తూర్పు సిటీ అధ్యక్షులు విబి రాజు మాట్లాడుతూ సత్వరమే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కలుగచేసుకొని అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి చంద్రశేఖర్, మోహన్‌రావు, కందుకూరి వెంకటేశ్వరరావు, ఆధాం తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలం ఒప్పందాలను అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇటీవల మున్సిపల్ కార్మికుల సమ్మె కాలంలో ప్రభుత్వం చేసిన ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షులు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం విఎంసి సర్కిల్ వన్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ 16 రోజుల సమ్మె కాలంలో కార్మికులతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. అలాగే రూ.24,500 వేతనాలు, జిఓ ఎంఎస్ 11 ఇంజనీరింగ్ కార్మికులు స్కిల్, సెమిస్కిల్ వేతనాలు పెంపుదల. అంశాలను వెంటనే జీవో రూపంలో విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకాలం వేతనాలు, సంక్రాంతి రూ.వెయ్యి కానుక వెంటనే అమలు చేయాలన్నారు. లేనియెడల మరల ఫిబ్రవరి మాసంలో ఆందోళనలు ప్రారంభించవలసి వస్తుందని తెలియపరిచారు. సమాన పనికి సమాన వేతనం, ముఖ్యమంత్రి పర్మినెంట్ హామీలు అమలు చేయకుండా మోసం చేస్తే కార్మికులు తగిన విధంగా ఉద్యమించవలసి వస్తుందని హెచ్చరించారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేసి ముఖ్యమంత్రి హామీల అమలు చేయాలని ఈ సందర్భంగా కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు వారి సమ్మెకు మున్సిపల్ కార్మికులు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీ, కొండ, శ్రీనివాస్, వీరమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.